క్లుప్తంగా

కారు బోల్తా



ఘటనా స్థలంలో కారు

వెంకటాచలం: మండలంలోని వెంకటాచలం పరిధిలో జాతీయ రహదారిపై గురువారం కారు బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

గ్రంథాలయ విజ్ఞానం పుస్తకావిష్కరణ



నెల్లూరు రూరల్: గ్రంథాలయ విజ్ఞాన వ్యాస సంకలనాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో జేసీ కార్తీక్ గురువారం ఆవిష్కరించారు. తొలి ప్రతిని కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజాకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు టేకుముళ్ల వెంకటప్పయ్య, కవి పెరుగు రామకృష్ణ, అరసం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్, ఐనకోట రవికుమార్, యర్రబత్తిన మునీంద్ర పాల్గొన్నారు.

నిబంధనలను గ్యాస్ డీలర్లు పాటించాలి



మాట్లాడుతున్న ఈశ్వరరావు

నెల్లూరు(అర్బన్): గ్యాస్ ఏజెన్సీల డీలర్లు నిబంధనలను పాటించాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు పేర్కొన్నారు. మెట్రాలజీ వారోత్సవాలను పురస్కరించుకొని ఎల్పీజీ గ్యాస్ డీలర్లతో ఆ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెలివరీ బాయ్స్ టిప్పులు, అదనంగా వసూలు చేయకూడదని చెప్పారు. ఈ అంశంపై అమరావతి నుంచి ప్రభుత్వం మానిటర్ చేస్తోందని తెలిపారు. 19 కిలోల సిలిండర్లపై ధర, బరువు ట్యాగ్‌లు తప్పక ఉండాలన్నారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో ధ్వజావరోహణ



నెల్లూరు సిటీ: నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజావరోహణాన్ని గురువారం నిర్వహించారు. ఏడు కోనేర్ల వద్ద చక్రస్నానాన్ని జరిపారు. ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కావలిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో అండర్ – 13 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన నెల్లూరు క్రీడాకారుడు శ్రీరామ్‌చౌదరిని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ అభినందించారు. చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని కురుక్షేత్ర చెస్ అకాడమీలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కోచ్‌లు భరత్‌కుమార్, వెంకటేష్, తల్లిదండ్రులు కిరణ్‌చౌదరి, విజయలక్ష్మికి అభినందనలను తెలియజేశారు.

25న పాటలు, డ్యాన్స్ పోటీలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పాటలు, డ్యాన్స్ పోటీలను ఈ నెల 25న నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. ఆసక్తి గలవారు తమ ఎంట్రీలను 77299 42543 నంబర్‌కు ఈ నెల 22లోపు పంపాలని సూచించారు. రఘురామిరెడ్డి, అంకిరెడ్డి, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం

- వేసవి నేపథ్యంలో నిత్యం ఘటనలు
- గ్రామాల్లో కంచెలు, గడ్డివాముల దగ్ధం
- నిర్లక్ష్యం కూడా ఒక కారణమే..
- మూడు మండలాలకు ఒక్కటే ఫైర్ స్టేషన్
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

పాదలకూరు ఫైర్ స్టేషన్ పరిధిలో..

2020 - 25 మధ్య జరిగిన అగ్ని ప్రమాదాలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో	: 110
దీపాల వల్ల	: 3
చిమ్నీ	: 1
గ్యాస్, కోల్	: 2
తగులబెట్టడంతో	: 8
ఓపెన్ స్టౌలతో	: 10
నిర్లక్ష్యంగా పొగ తాగడం	: 146
టపాసుల తయారీ	: 12



కాలిపోయిన గడ్డివాములు

పొదలకూరు: వేసవి నేపథ్యంలో మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. పొదలకూరు ఫైర్ స్టేషన్ పరిధిలో పొదలకూరుతోపాటు చేజర్ల, కలువాయి మండలాలున్నాయి. ఎండా కాలంలో ప్రధానంగా గడ్డివాములు, నిమ్మతోటల కంచెలు తగులబడుతున్నాయి. కొందరు నిర్లక్ష్యం కారణంగా గడ్డివాములు అధికంగా దగ్ధమవుతున్నట్టు తెలుస్తోంది. పూరిళ్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి కొన్నిచోట్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కూడా తగులబడుతున్నట్టు సమాచారం. పలువురు సిగరెట్, బీడీలు తాగి పడేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నట్టు అగ్నిమాపక సిబ్బంది వెల్లడిస్తున్నారు. మరికొన్నిచోట్ల పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని కుప్పలు, పూరిళ్లు, కంచెలు తగులబెడుతుంటారు. పొదలకూరు ఫైర్ స్టేషన్ పరిధిలో అలాంటి అగ్నిప్రమాదాల సంఖ్యే అధికంగా ఉండటం గమనార్హం. ఇలాంటి కేసులు 144 వరకు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

దూరం కావడంతో..

కలువాయి మండలం పొదలకూరుకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ ప్రమాదం సంభవిస్తే ఇక్కడి నుంచి అగ్నిమాపక వాహనం వెళ్లే సమయానికి దాదాపుగా తగులబడుతున్నట్టు తెలుస్తోంది. అగ్నిప్రమాదాలకు సంబంధించి సరిహద్దులు ఉండటం వల్ల అందుబాటులో ఉన్న స్టేషన్ నుంచి ఘటనా స్థలాల వద్దకు వెళ్లాలంటే సంబంధిత పరిధిలోని స్టేషన్ నుంచి సమాచారం అందాలి. ఇందువల్ల కూడా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వెళ్లలేపోతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఇళ్లలో మహిళలు గ్యాస్‌పై వంట చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు. రెగ్యులేటర్‌ను రాత్రివేళ కచ్చితంగా ఆపివేయాలి. చాలాచోట్ల నిర్లక్ష్యంగా సిగరేట్, బీడీలు తాగి పడవేయడంతో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలపై ప్రతి ఏడాది ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోంది.

– విజయ వరకుమార్, ఫైర్ ఆఫీసర్, పొదలకూరు

అవగాహన కల్పిస్తూ..

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. అయినా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. వారోత్సవాల్లో సిబ్బంది, అధికారి కలిసి వంట గ్యాస్ వినియోగం, పెట్రోలు, గ్యాస్ గోదాములు, సినిమా హాళ్లు, స్కూళ్లు తదితర ప్రాతాల్లో ప్రమాదాలు జరిగితే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరిస్తున్నారు. గ్రామాల్లో అత్యధికంగా గడ్డివాములు, తోటల్లో కంచెలు తగులబడుతున్నాయి. ఇటీవల నేదురుమల్లి, లింగంపల్లి, పొదలకూరు, బిరదవోలు, మొగళ్లూరు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించాయి. ప్రతి ఏడాది వేసవిలోనే అధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ (ఫైల్)



పొదలకూరు ఫైర్ స్టేషన్

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకి సేవ జరిగింది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఏకాంతసేవను రాత్రి నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు తులసీరామ్ ఆధ్వర్యంలో జరిపారు. తొలుత చెన్నకేశవస్వామి శ్రీదేవీ, భూదేవీతో కలిసి అత్తారింటికి వెళ్లే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

తోటపల్లిగూడూరు: కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా పిలుపునిచ్చారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రం మినహాయిస్తే మిగిలిన చోట్ల కార్మిక సంక్షేమ పథకాలు అరకొరగా అమలవుతున్నట్టు విమర్శించారు. ఏపీలో సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ ఉత్తర్వులను ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల దేశవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు మొత్తంగా సంక్షేమం నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు అన్నం పొట్టెయ్య, వెంకటశేషయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు నాశిన పరశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** సమ్మెలో తాము పాల్గొంటామని ముత్తుకూరు ఫిషరీస్ కాలేజీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు తెలిపారు. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపల్‌కు గురువారం తెలియజేశారు.

ఉత్సాహంగా పోటీలు



కొడవలూరులో..

కొడవలూరు: వేసవిలో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ ఎంతో శ్రేయస్కరమని లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో విద్యార్థులతో క్యారమ్స్, చెస్‌ను గురువారం ఆడించారు. చెస్‌లో ప్రావీణ్యం సంపాదిస్తే ఉన్నత స్థాయి క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంటుందని చెప్పారు.

⇨ కొడవలూరులోని గ్రంథాలయంలో పలు చిత్రాలను విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రాజేశ్వరి మాట్లాడారు. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

చిన్నారులకు ఆటపాటలతో విద్య



ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. సంసిద్ధత ఉత్సవాన్ని మైపాడుపాళెంలో జిల్లా పథం డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ అశోక్‌కుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మంజుల, లలితాంబ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా శరత్‌బాబు

మనుబోలు: మండల హౌసింగ్ ఏఈగా ఎస్.శరత్‌బాబును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు అందజేశారు. ఆయన గురువారం బాధ్యతలను స్వీకరించారు. శరత్‌బాబు ఇక్కడే వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న భాస్కర్‌రావు నెల్లూరు ఏఈగా బదిలీపై వెళ్లారు.

వేలం నిర్వహణ

విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో త్వరలో నిర్వహించనున్న తిరునాళ్లకు సంబంధించిన వేలాన్ని ఆలయాధికారులు గురువారం నిర్వహించారు. దుకాణాలు, టెంకాయలు, పూజా సామగ్రి, కొబ్బరి చిప్పలకు సంబంధించి నిర్వహించిన వేలానికి పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ రామకృష్ణ మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఆదాయం రూ.3,39,500 మేర పెరిగిందని చెప్పారు. రంగుల రాట్నాలకు సంబంధించిన వేలానికి ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశారు. ఈఓలు కృష్ణప్రసాద్, చందన, గుమాస్తా వెంకటేశ్వర్లు, నేతలు ఆవుల వాసు, వనమాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా ప్రశాంత్

పొదలకూరు: భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షుడిగా పొదలకూరు పట్టణానికి చెందిన పూల ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ప్రశాంత్‌ను మండల పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు చినసుబ్రహ్మణ్యం, ఓబులేసు, ధనుంజయరావు, జనార్దనరెడ్డి, సురేంద్రబాబు, రవీంద్రబాబు తదితరులు ప్రశాంత్‌ను అభినందించారు.

రెండు వాహనాల పట్టివేత



పోలీసుల అదుపులో చికెన్ వ్యర్థాల లారీ

సంగం: మండలంలోని సంగం కొండమలుపులో చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండ ప్రాంతంలో గుంతతీసి మత్స్య, రెవెన్యూ శాఖల అధికారుల సమక్షంలో చికెన్ వ్యర్థాలను పూడ్చిపెట్టారు. వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. అలాగే గత ఫిబ్రవరిలో మండలంలోని పడమటిపాళెం, దువ్వూరు ప్రాంతాల్లో 30 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మార్చిలో చికెన్ వ్యర్థాల లారీని మాజీ ఎంపీటీసీ స్వయంగా పట్టుకుని అధికారులకు అప్పగించారు.

పలువురికి ప్రసన్న పరామర్శ



విడవలూరు: మండలంలో పలువుర్ని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గాదెలదిన్నెకు చెందిన జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య కుమారుడు, సర్పంచ్ తుమ్మల వెంకటేశ్వర్లు ఇటీవల గొంతు సంబంధిత వైద్యం పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. తుమ్మల లక్ష్మయ్య చిన్నమ్మ కావమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

⇨ రామతీర్థానికి చెందిన పార్టీ నేత నిమ్మల కృష్ణయ్య ఇటీవల మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. మండలంలోని పాతూరుకు చెందిన పార్టీ నేత నాటూరు సుబ్రహ్మణ్యం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబీకులను పరామర్శించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ అనపల్లి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ

వెంకటాచలం: వెంకటాచలంలోని అక్షర విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణకు గురువారం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు కరిమెద్దల నరసింహారెడ్డి విచ్చేసి సైన్యం, జవాన్ల త్యాగాలు, ఎన్‌సీసీ క్యాడెట్ల బాధ్యతల గురించి వివరించారు. ఫైరింగ్, డ్రిల్, వ్యాయామం, యోగా, ఎన్‌సీసీ సిలబస్‌పై అధికారులు బాలబ్రహ్మాచారి మస్తాన్‌వలీ, దీప్తి, హరీష్‌రెడ్డి, జయరాం, ప్రసాద్, జావీద్‌బాషా తదితరులు వివరించారు. క్యాంపును కమాండెంట్ కల్నల్ ఈ.కరంచంద్, సుబేదార్ మేజర్ రాజేష్ కుమార్, సుబేదార్ హేమంత్ కుమార్ పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

చంద్రశేఖరపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు కోరారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేయడంతో పాటు గర్భిణుల ఇంటికే వెళ్లి పరీక్షలు చేశారు. హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏలు సుధాకర్, రాధమ్మ, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, కల్పన, శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వే పరిశీలన

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం తహసీల్దార్ సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ డాక్యుమెంట్లను వీఆర్వోలకు అందజేయాల్సిందిగా సూచించారు. మనుబోలులో 4,950 ఎకరాలకు రీసర్వేను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిని జూన్ 16వ తేదీ నాటికి పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు.

కార్యక్రమంలో సర్వేయర్ శ్రీహరి, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్